సాక్షి చిత్తూరు
సోమవారం । 27 । మే । 2024



**పులి పేరిట ఆటలు**
'పులి సంచరిస్తోందని' తప్పుడు ప్రచారం చేస్తున్న ఆకతాయిల చర్యలను అటవీశాఖ తీవ్రంగా పరిగణిస్తోంది. - 8లో



**ప్రశాంత కౌంటింగ్‌కు సహకరించాలి**
ప్రశాంత కౌంటింగ్‌కు ప్రజలు, పార్టీల నాయకులు సహకరించాలని ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. - 8లో



**సత్యంతోనే అవినీతికి చరమగీతం**
ప్రతిమనిషి సత్యాన్ని గ్రహిస్తే అవినీతికి చరమగీతం తప్పదని పారిశ్రామికవేత్త రత్నారెడ్డి అన్నారు. - 8లో

## న్యూస్‌రీల్

### కౌంటింగ్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ఓట్ల లెక్కింపు కేంద్రంలో నిబంధనలు తప్పని సరిగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ ఆదేశించారు. కౌంటింగ్ ఏర్పాట్లపై ఆయన ఆదివారం క్షేత్రస్థాయి సిబ్బందితో ఫోన్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కేంద్రంలో నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈవీఎం ఓట్ల లెక్కింపునకు ప్రతి టేబుల్ వద్ద ఒక సూపర్‌వైజర్, సహాయకుడు, మైక్రో అబ్జర్వర్ ఉంటారన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు వద్ద ప్రతి టేబుల్ వద్ద ఒక సహాయ రిటర్నింగ్ అధికారి, సూపర్‌వైజర్, సహాయకులు, మైక్రో అబ్జర్వర్‌లు ఉంటారని తెలిపారు. కౌంటింగ్ అధికారులను, సిబ్బందిని ఎన్నికల సంఘం నిబంధనల మేరకు సాంకేతిక విధానంలో ర్యాండమైజేషన్ చేస్తామన్నారు. ఏజెంట్లకు గుర్తింపు కార్డులు జారీచేస్తామని తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు జిల్లాలో మోడల్ కోడ్ అమలులో ఉంటుందన్నారు. విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు, టపాసులు కాల్చడం వంటివి నిషేధమని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.

### 30న కాణిపాకం హుండీ లెక్కింపు

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో ఈనెల 30న హుండీ కానుకలను లెక్కించనున్నట్లు ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆలయంలో ఆరోజు ఉదయం 7 గంటలకు లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. అధికారులు, ఉభయదారులు పాల్గొనాలని కోరారు.

### జిల్లా వ్యాప్తంగా కార్డెన్ సెర్చ్



చిత్తూరు ప్రశాంత్ నగర్ వాసులతో మాట్లాడుతున్న చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఆదివారం పోలీసుశాఖ కార్డెన్ సెర్చ్ నిర్వహించింది. ఎస్పీ ఆదేశాల మేరకు అధికారులు, సిబ్బందితో కలిసి ముమ్మరంగా సబ్ డివిజన్ పరిధిలో కార్డెన్ సెర్చ్ చేపట్టారు. అక్రమంగా దాచి ఉంచిన ఆయుధాలు, పేలుడు పదార్థాలు, బాణసంచా, పెట్రోల్, డీజిల్, మాదక ద్రవ్యాలు, పరారీలో ఉన్న నేరస్తులను గుర్తించి అదుపులోకి తీసుకునేందుకు, అనుమానిత వాహనాలను సీజ్ చేసే లక్ష్యంతో ఉదయం 5 నుంచి 7 గంటల వరకు తనిఖీలు చేశారు. గుడిపాల మండలం రాసనపల్లెలో 4 ద్విచక్రవాహనాలు, 600 లీటర్ల సారా తయారు చేసే పదార్థాలు, ఐరాలలో 12 ద్విచక్రవాహనాలు, సదుంలో రెండు ద్విచక్రవాహనాలు, పలమనేరు సర్కిల్ ఆరు ద్విచ్ర వాహనాలు, 200 లీటర్ల సారాను ధ్వంసం చేశారు. నగరిలో 15 ద్విచక్రవాహనాలు, రెండు ఆటోలను సీజ్ చేశారు. ఎవరైనా రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసినా, ఘర్షణలకు ప్రేరేపిస్తున్నా వెంటనే దగ్గర్లలోని పోలీస్ స్టేషన్‌కు, 100, 112, 9440900005 నంబర్లకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా పోలీసు అధికారులు తెలిపారు. సమాచారం అందించిన వ్యక్తి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

### పంట పొలాలపై గజరాజుల దాడి



కొమ్మిరెడ్డిగారిపల్లె సమీపంలో ధ్వంసమైన తోట

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని దేవళంపేట పంచాయతీ కొమ్మిరెడ్డిగారి పల్లె సమీపంలోని మామిడి తోటల్లో ఆదివారం తెల్లవారు జామున ఏనుగులు గుంపు ప్రవేశించి బీభత్సం సృష్టించాయి. ఆదివారం ఉదయం తోటల వద్దకు వెళ్లిన రైతులు కొమ్మలు విరిగి, పంట నేలపాలు అయి ఉండడాన్ని గుర్తించారు. రైతులు మాట్లాడుతూ పంట కొచ్చిన సమయంలో భారీగా కొమ్మలను విరిచివేయడంతో కాయలు నేలపాలయ్యాయని తెలిపారు. ఎక్కువ మొత్తంలో పంట నష్టం అయినట్లు పేర్కొన్నారు. వారం రోజులుగా ఈచుట్టు పక్కల గ్రామాల్లోనే ఏనుగులు సంచరిస్తున్నాయని తెలిపారు. అటవీశాఖ అధికారులు స్పందించి పంట పొలాలపై ఏనుగుల దాడులను అరికట్టాలని రైతులు కోరారు.

# చెన్నై-బెంగళూరు.. ఎక్స్‌ప్రెస్ వే

చెన్నై- బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ మహానగరాలకు వెళ్లాలంటే ప్రయాణికులకు ఆరేడు గంటల సమయం పడుతోంది. ఈ హైవే పూర్తయితే ప్రయాణ సమయం కేవలం 2.30 గంటలే. చెన్నై-బెంగళూరు మధ్య చిత్తూరు జిల్లా నుంచే రోడ్డు నిర్మాణం సాగుతోంది. వచ్చే ఏడాది జూన్ నాటికి ప్రారంభమయ్యేలా పనులు ఎక్స్‌ప్రెస్ వేగం పుంజుకున్నాయి. ఈ రెండు మహానగరాలకు జిల్లావాసులు తక్కువ సమయంలోనే హాయిగా ప్రయాణించే అవకాశం త్వరలోనే సాకారం కానుంది.




**రూ.4259 కోట్లతో 262 కిలోమీటర్ల హైవే**

- ఊపందుకున్న రోడ్డు నిర్మాణ పనులు
- చిత్తూరుజిల్లాలో 93 కిలోమీటర్ల రహదారి
- కౌండిన్య అటవీశాఖ అనుమతులతో వేగంగా పనులు
- ఏపీ, తమిళనాడు నుంచి బెంగళూరుకు తగ్గనున్న ప్రయాణ సమయం
- త్వరలోనే సాకారమయ్యేలా ప్రణాళిక

సాక్షి, చిత్తూరు: మహానగరాలైన చెన్నై-బెంగళూరుకు రోడ్డు కనెక్టివిటీ పెంచాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. రూ.4,259 కోట్ల అంచనాలతో బెంగళూరు, చెన్నై మధ్య 262 కిలోమీటర్ల దూరం ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు నిర్మాణం పనులకు శ్రీకారం చుట్టింది. అక్టోబరు 10, 2022న పనులు ప్రారంభించింది. ఈ రోడ్డు మార్గం కర్ణాటక రాజధాని బెంగళూరు రూరల్, కోలార్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా మీదుగా తమిళనాడులోని రాణిపేట, కాంచీపురం జిల్లాల నుంచి చెన్నై వరకు రోడ్డు నిర్మాణం సాగుతోంది.

**జిల్లాలో 93 కిలోమీటర్ల హైవే**

ఈ రోడ్డు మార్గం చిత్తూరు జిల్లాలో సుమారు 93 కిలోమీటర్లు నిర్మిస్తున్నారు. వీకోట, బైరెడ్డిపల్లె, పలమనేరు, బంగారుపాళెం, యాదమరి, చిత్తూరు, గుడిపాల మీదుగా చెన్నై వరకు నిర్మిస్తున్నారు.

**జిల్లాలో మూడు ఎంట్రీలు, ఎగ్జిట్‌లు**

ఎక్స్‌ప్రెస్ హైవేలోకి వెళ్లేందుకు జిల్లాలో మూడు ఎంట్రీ, ఎగ్జిట్‌లు మాత్రమే ఉన్నాయి. ఇవి చిత్తూరుకు సమీపంలోని గుడిపాల, బంగారుపాళెం సమీపంలోని మొగిలిఘాట్, పలమనేరు నియోజవర్గంలోని బైరెడ్డిపల్లెలోమాత్రమే ఉన్నాయి. సుమారు 40 కిలోమీటర్ల మధ్య దూరంతో ఎంట్రీ, ఎగ్జిట్‌లు నిర్మిస్తున్నారు. తమిళనాడులోని వేలూరు, సమీప ప్రాంతం నుంచి బెంగళూరు వెళ్లే వారు గుడిపాల ఎంట్రీ నుంచి హైవేలోకి రావచ్చు. తిరుపతి మీదుగా వెళ్లే వారికి మొగిలిఘాట్‌లో ఎంట్రీ, ఎగ్జిట్ అనుకూలంగా ఉంటుంది. పుంగనూరు, పలమనేరు, కుప్పం ప్రాంతాల నుంచి వెళ్లే వాహనదారులకు బైరెడ్డిపల్లె నుంచి ఎంట్రీ, ఎగ్జిట్ సౌకర్యంగా ఉంటుంది.

**ద్విచక్ర వాహనాలు, ఆటోలకు నో ఎంట్రీ**

హైవేలోకి కార్లు, బస్సులు, హైస్పీడ్ ట్రక్కులకు అనుమతి ఉంటుంది. ఎట్టిపరిస్థితుల్లోనూ ద్విచక్రవాహనాలు, ఆటో, లారీ, ఇతర వాహనాలకు అనుమతి లేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

**2.30 గంటల్లోనే బెంగళూరుకు**

చెన్నై-బెంగళూరు మధ్య 2021లెక్కల ప్రకారం రోజూ 27,952 వాహనాలు రాకపోకలు సాగించాయి. ఈ నగరాల మధ్య 5 నుంచి 7 గంటలు సమయం పట్టేది. ఎక్స్‌ప్రెస్ హైవే అందుబాటులోకి వస్తే రోజూ 33,274 వాహనాలు రాకపోకలు సాగించే అవకాశం ఉంటుందని అంచనా. ప్రయాణ సమయం కూడా 2.30 గంటల్లోనే గమ్యస్థానం చేరుకునే అవకాశం ఉంటుంది.

**అటవీశాఖకు రూ.66 కోట్ల పరిహారం**

జిల్లాలో నిర్మిస్తున్న హైవే రోడ్డు పనులు కౌండిన్య అభయారణ్యంలో సాగుతున్నాయి. అటవీప్రాంతంలోని 48 కిలోమీటర్ల మార్గంలో ఈ రోడ్డు నిర్మాణం సాగుతోంది. ఇందులో 41.5 కిలోమీటర్ల దూరం ఎకో సెన్సిటివ్ జోన్‌గా ఇప్పటికే అటవీశాఖ ప్రకటించింది. ఇక్కడ జంతువుల నివాసంగా పరిగణిస్తారు. 7.1 కిలోమీర్లు మాత్రం అన్ని రకాల జంతువులు సంచరించే ప్రాంతంగా ప్రకటించారు. ఈ మార్గంలోని 3.5 కిలోమీటర్లు దూరం మధ్యలోనే జంతువులు అటుఇటుగా రాకపోకలు సాగించేందుకు వీలుగా హైవే రోడ్డు కింది భాగంలో 5 అండర్ పాస్ బ్రిడ్జిలు నిర్మిస్తున్నారు. ఇందులో భూ పరిహారం కింద అటవీశాఖకు రూ.49 కోట్లు పరిహారం చెల్లించారు. అటవీశాఖ వన్యప్రాణుల సంక్షరణ చట్టం కింద జంతువులు రక్షణ, నీటి వసతి కల్పన, అటవీ సంక్షరణ సిబ్బంది నియామకం వంటివి ఐదేళ్ల పాటు నిర్వహణ కోసం రూ.17 కోట్లు అటవీశాఖకు చెల్లించారు. అటవీ మార్గాలు, లోయ ప్రాంతాల్లో 4 నుంచి 50 మీటర్ల ఎత్తు, 150 అడుగుల వెడల్పుతో బ్రిడ్జిల నిర్మాణం సాగుతోంది.

**తొలుత నాల్గులేన్లు.. మలి దశలో 8లేన్ల విస్తరణ**

మొత్తం 150 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాణం సాగుతోంది. ఒకవైపు రెండు, మరోవైపు రెండు లేన్లతో రోడ్డు పనులు సాగుతున్నాయి. భవిష్యత్‌లో ఇటుఇటుగా మరో రెండేసి చొప్పున మొత్తం 8 లేన్లతో నిర్మించేలా ఇప్పటికే భూ సేకరణ పూర్తి చేసి పనులు సాగిస్తున్నారు. హైవే నిర్మాణం అవసరానికి తగిన విధంగా 10 నుంచి 15 అడుగుల ఎత్తులో పనులు సాగిస్తున్నారు. హైవే కింది భాగంలో ఇటుఅటు ప్రయాణ మార్గాల కోసం సుమారు 46 అండర్ పాస్‌లు నిర్మిస్తున్నారు. 7 ఓవర్ ప్యాసేజ్‌లు, 7 ఫ్లై ఓవర్లు, 55 బ్రిడ్జిలు నిర్మిస్తున్నారు.

**పరిశ్రమల కారిడార్‌గా చిత్తూరు**



పలమనేరు అటవీ ప్రాంతంలో సర్వే చేస్తున్న ఫారెస్టు అధికారులు(ఫైల్)

బెంగళూరు- చెన్నై మహానగరాలకు మూడు హైవేలతో రోడ్డు కనెక్టివి పెరిగింది. పరిశ్రమల స్థాపనకు చిత్తూరు జిల్లా అనుకూలంగా మారింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభ్యర్థన మేరకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల ద్వారా చిత్తూరు జిల్లాలో రానున్న కాలంలో భారీగా పారిశ్రామిక ప్రగతి జరగనుంది. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన మూడు జాతీయ రహదారులు చిత్తూరు జిల్లా మీదుగా వెళ్లడం పారిశ్రామిక ప్రగతికి మార్గం సుగమం అవుతుందని నిపుణులు భావిస్తున్నారు. ప్రత్యేకించి ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డుకు ఇరువైపులా అండర్‌పాస్‌లు ప్రాంతాల్లో పలు పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలం కానుంది. చిత్తూరు జిల్లా పరిధిలోని 93 కిలోమీటర్ల రహదారిలో పలు పరిశ్రమలు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఇప్పటికే ప్రణాళికలు అమలు చేస్తోంది. పరిశ్రమలు స్థాపించే పెట్టుబడిదారులకు నిబంధనల ప్రకారం వెనువెంటనే క్లియరెన్స్ ఇస్తోంది. చెన్నై -బెంగళూరు నగరాలతోపాటు పుంగనూరు వంటి నగరాలకు కనెక్టివిటి పెరిగింది. దీనిద్వారా పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చేసేందుకు పరిస్థితులు అనుకూలంగా మారాయి. నీరు, విద్యుత్ కనెక్టివిటీ బాగా ఉండడంతో రాబోయే కాలంలో ఇదొక పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చెందనుంది. ఇప్పటికే ఈ రహదారుల అటుఇటుగా సమీపంలోని కోసలనగరం, గంగ్రాజుపల్లి, గుడిపాల, చిత్తూరు, పుంగనూరు, ప్రాంతాల్లో పలు పరిశ్రమలు ఏర్పాటు అయ్యాయి.



కర్ణాటకలోని కోలార్ జిల్లాలో జరుగుతున్న పనులు



పలమనేరు బేలుపల్లె వద్ద రోడ్డు నిర్మాణ పనులు

**వచ్చే జూన్‌కు అందుబాటులో**



"ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డును 2025 జూన్‌లో అందుబాటులో తీసుకురావాలని ప్రయత్నిస్తున్నాం. ఇప్పటికే 50 శాతంపైగా పనులు పూర్తి అయ్యాయి. తమిళనాడు, కర్ణాటక మధ్యలో చిత్తూరు జిల్లా ఉండడంతో ఈ ప్రాంతం వారికి అనుకూలంగా ఉంటుంది. బెంగళూరు- చెన్నైకి 2.30 గంటల సమయంలో ప్రయాణం చేయవచ్చు. వాహనాల రాకపోకలు పెరుగుతాయి. పారిశ్రామికంగా అభివృద్ధి చెంది చుట్టు పక్కల ప్రాంతాల వారికి ఉపాధి లభిస్తుంది. – కార్తీక్‌రెడ్డి, పీడీ, ఎన్‌హెచ్‌ఏఐ

**దేశంలోనే ప్రతిష్టాత్మక బ్రిడ్జి**



రోడ్డు మొత్తం 85 కిలోమీటర్లు కాగా, అందులో 48 కి.మీ. రోడ్డు అటవీ ప్రాంతంలో వస్తుంది. జంతువులు ఉండే దట్టమైన అభయారణ్య ప్రాంతం కావడంతో 3.5 కిలోమీటర్లు అక్కడ 5 అండర్ పాస్ బ్రిడ్జిలు నిర్మించనున్నారు. వీటి ద్వారా ఏనుగులు, ఇతర జంతువుల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవు. మనుషులకు ఎటువంటి ప్రమాదం ఉండదు. మధ్యప్రదేశ్‌లో పులల కోసం 700 మీటర్లు అండర్‌పాస్ బ్రిడ్జిలు నిర్మించారు. ఇక్కడ 3.5 కిలోమీటర్ల మధ్య దూరంలో ఏకంగా 5 బ్రిడ్జిలు నిర్మిస్తుండడం దేశంలోనే ఇదే మొదటిసారి. – చైతన్యకుమార్‌రెడ్డి, డీఎఫ్‌ఓ

# వేణుగోపాలుని బ్రహ్మోత్సవాలకు వేళాయే..

కార్వేటినగరంలో టీటీడీ అనుబంధ ప్రసిద్ధ శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. ఈనెల 29 నుంచి పది రోజులపాటు జరిగే ఉత్సవాలకు టీటీడీ ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. రోజుకో అవతారంలో స్వామివారు పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించనున్నారు.

- 28 అంకురార్పణ, 29న ధ్వజారోహణం
- ఆకట్టుకునే ఏకశిలా ధ్వజస్తంభం



ముస్తాబవుతున్న వేణుగోపాలస్వామి ఆలయం



వంద అడుగులకు పైగా ఎత్తున్న ధ్వజస్తంభం

కార్వేటినగరం : మండల కేంద్రంలోని అతిపురాతన శ్రీరుక్మిణి, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం చేస్తున్నట్లు టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవ వివరాలు వెల్లడించారు. ఈ 28వ తేదీ సాయంత్రం అంకురార్పణ, 29న ఉదయం ధ్వజారోహణం, రాత్రి పెద్ద శేషవాహనం, 30న ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనంపై ఊరేగింపు ఉంటుంది. 31న ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహనం, ఒకటో తేదీ ఉదయం కల్పవృక్ష వాహనం, ఆర్జిత కల్యాణోత్సవం, రాత్రి సర్వభూపాల వాహనం, 2న ఉదయం మోహినీ అవతారం, రాత్రి గరుడ సేవ, 3న ఉదయం హనుమంత వాహనం, సాయంత్రం గజవాహనం, 4న ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ, 5న రథోత్సవం, రాత్రి అశ్వవాహనం, 6న ఉదయం పల్లకిసేవ, చక్రస్నానం, సాయంత్రం ధ్వజావవరోహణం ఉంటుందని వివరించారు. ఆలయం వద్ద చలువపందిళ్ల ఏర్పాటు, రంగవల్లుల పనులు జరుగుతున్నాయని తెలిపారు.

**ఆలయ విశిష్టత**



ఆలయ ఆవరణలో రంగవల్లులు తీర్చిదిద్దుతున్న సిబ్బంది

తిరుమల ఆలయంలో శ్రీవారితో పూజలందుకుంటున్న రుక్మిణి, సత్యభామా సమేత శ్రీవేణుగోపాలస్వామి దేవతా మూర్తులను ఇక్కడికి తెప్పించి వైఖానసులచే ప్రతిష్టించినట్లు పురాణ కథనం. సంతాన ప్రదాతగా శ్రీవేణుగోపాలస్వామి విరాజిల్లుతున్నారు. ఆకాశరాజు తర్వాతి వంశానికి సంతానం కలగక పోవడంతో నారాయణరాజు ఆస్థాన జ్యోతిష్యుల సూచనలతో శ్రీవేణు గోపాలుని పూజించి సంతాన వరం పొందినట్లు పురాణ కథనం. ఆయన వంశానికి చెందిన వెంకటపెరుమాళ్‌రాజు 1610-1719 సంవత్సరాల మధ్య కాలంలో ఆలయాన్ని నిర్మించినట్లు ప్రతీతి. ఆలయంలోని శిల్పకళా సౌందర్యం వర్ణానాతీతం. సంస్థాధీశుల పాలన అనంతరం 1936 నుంచి ఈ ఆలయం నిర్వాహణ దేవదాయశాఖ పరిధిలోకి వచ్చింది. 1989 ఏప్రిల్ పది నుంచి తిరుమల-తిరుపతి దేవస్థానం పరిధిలోకి వచ్చింది. ఆలయంలో మకరతోరణం, గోమాతతో రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలుడి విగ్రహాలను ఏకశిలతో రూపొందించడం విశేషం. ఆలయ ఆవరణలో శ్రీఆంజనేయస్వామి సన్నిధికి ఎదురుగా సుమారు వంద అడుగులకు పైగా ఏకశిలా ధ్వజస్తంభం భక్తులను ఆకట్టుకుంటుంది. పుత్తూరు నుంచి 12 కిలో మీటర్ల దూరంలో కార్వేటినగరం ఉంది.

# శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి



సంకట హర చతుర్థి వ్రతంలో పాల్గొన్న భక్తులు



స్వర్ణ రథంలో విహరిస్తున్న స్వామివారు

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ఆదివారం సంకటహర చతుర్థిని అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని మూలమూర్తికి ప్రత్యేక అభిషేకపూజలు, అలంకరణలు చేశారు. సాయంత్రం శ్రీస్వామివారి ఉత్సవమూర్తిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఊరేగింపుగా ఆస్థాన మండపానికి తీసుకు వచ్చి వేదికపైకి కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి సామూహికంగా సంకట హర చతుర్థి వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు వ్రత పూజల్లో పాల్గొన్నారు. రాత్రి 8 గంటలకు స్వర్ణ రథోత్సవం నయనానందకరంగా సాగింది. అశేష భక్తులు జై గణేషా..జైజై గణేశ అంటూ స్వామివారిని దర్శించుకుని తన్మయత్వం చెందారు. దేవస్థానం ఈఓ వెంకటేశ్వర్లు, ఏఈఓ విద్యాసాగర్, అధికారులు కోదండపాణి, వాసు రమేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

**ఆలయంలో భక్తుల రద్దీ**

ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం, వేసవి సెలవుల కారణంగా భక్తుల రద్దీ అమాంతంగా పెరిగింది. ఉచిత, ప్రత్యేక దర్శన క్యూలైన్లీ కిక్కిరిశాయి. ఉదయం నుంచి రాత్రి వరకు స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. భక్తులకు శీఘ్ర దర్శనం కల్పించేందుకు ఈఓ వెంకటేశ్వర్లు చర్యలు తీసుకున్నారు. భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.



క్యూలో వేచి ఉన్న భక్తులు

## గురుకుల అడ్మిషన్లకు నేరుగా హాజరుకావాలి

**చిత్తూరు కలెక్టరేట్ :** ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 2024–25 విద్యాసంవత్సరంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 5 వ తరగతి ప్రవేశాలకు పరీక్ష రాసిన విద్యార్థులు అడ్మిషన్లకు నేరుగా హాజరుకావాలని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జిల్లా కో ఆర్డినేటర్ జయభారతి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రవేశ పరీక్ష రాసిన ఎస్సీ బాలురు ఈనెల 28న ఉదయం 9 గంటలకు పూతలపట్టు గురుకుల పాఠశాలకు హాజరుకావాలని తెలిపారు. 5వ తరగతికి ప్రవేశ పరీక్ష రాసిన, రాయని ఎస్సీ,ఎస్టీ బాలికలు ఈ నెల 29న ఉదయం 10 గంటలకు గంగాధరనెల్లూరు గురుకుల పాఠశాలకు విచ్చేయాలని వెల్లడించారు. ప్రవేశ పరీక్ష రాసిన వారికి మొదటి ప్రాధాన్యతనిచ్చి, మిగిలిన సీట్లకు ప్రవేశ పరీక్ష రాయని వారికి అడ్మిషన్లు ఇస్తామని తెలిపారు. హాజరయ్యే విద్యార్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా తీసుకురావాలని డీసీఓ వెల్లడించారు.

## ఎర్రచందనం పట్టివేత

**తిరుపతి మంగళం:** రాపూరు సమీపంలోని మళ్లమ్మకోన బాట వద్ద ఆరు ఎర్రచందనం దుంగలతోపాటు ఒక కారును టాస్క్ ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆదేశాలు మేరకు డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్ కుమార్ అటవీశాఖ అధికారులు వై. మస్తాన్, ఎం. ప్రవీణ్ కుమార్ ఆదివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఓ కారులో ఎర్రదుంగలను లోడ్ చేయడం గమనించిన టాస్క్ ఫోర్స్ సిబ్బంది వారిని చుట్టుముట్టేందుకు యత్నించగా స్మగ్లర్లు అక్కడ నుంచి పరారయ్యారు. దీంతో కారు, ఎర్రదుంగలను స్వాధీనం చేసుకుని తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేశారు. సీఐ జి. శ్రీనివాసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**చిల్లకూరు :** మండలంలోని కడివేడు వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. సైదాపురం మండలం గిద్దలూరుకు చెందిన వేణుగోపాల్(55) చిల్లర దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో కోట పట్టణంలోని తన బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఉండగా కడివేడు వద్ద నేదురుమల్లి రాజ్యలక్ష్మి గిరిజన కాలనీ దాటిన తర్వాత రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొన్నాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషయం గుర్తించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న 108 వాహనంలో క్షతగాత్రుడిని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వేణుగోపాల్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 'కోడ్' ఉల్లంఘించిన ఉద్యోగి

**చంద్రగిరి :** ఎన్నికల కోడ్‌ను టీటీడీ టైం స్కేల్ ఉద్యోగి ఉల్లంఘించడంపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. చంద్రగిరి పాతపేట రెడ్డివీధికి చెందిన నాగరాజు టీటీడీ టైం స్కేల్ వాహన బేరర్‌గా గోవిందరాజ స్వామివారి ఆలయంలో విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన నిబంధనలకు విరుద్ధంగా టీడీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని నివాసానికి వెళ్లి పరామర్శించారు. ధార్మిక సంస్థలో పనిచేస్తూ రాజకీయనేతను పరామర్శించడం వివాదాస్పదంగా మారింది. దీనిపై టీటీడీ అధికారులు విచారించి ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



వడమాలపేట పరిధిలో పులి సంచరిస్తున్నట్లు వైరల్ అయిన ఫొటో, ఇన్‌స్టాగామ్‌లో గత నవంబరులో పోస్ట్ చేసిన పులి పోస్ట్, చిత్తూరు మండలంలో వచ్చినట్లు పెట్టిన అస్సాం బెంగాల్ టైగర్







# పులి పేరిట ఆటలు..



గుడిపాల అటవీ ప్రాంతంలో జల్లెడ పడుతున్న సిబ్బంది ఎఫ్ఆర్వో థామస్ (ఫైల్)

ఒక పల్లెటూరులో తండ్రిని ఓ పిల్లవాడు నాన్న పులి వచ్చిందంటూ రెండుసార్లు ఆటపట్టిస్తాడు. పావుగంట అయ్యాక మళ్లీ పులి అంటూ పిల్లవాడు కేకలు వేయడంతో ఎవరు పట్టించుకోరు. తీరా నిజంగానే పులి వచ్చి గొర్రెలను తీసుకెళుతుంది. ఈ కథలో నీతి ఏమిటంటే అబద్దాలు ఆడితే పరిహారం తప్పదని.. సరిగ్గా ఇదే విధంగా ప్రస్తుతం జిల్లాలో పలువురు 'పులి సంచరిస్తోందని' తప్పుడు ప్రచారం చేస్తూ జనాన్ని భయపెడతున్నారు. ఇవన్నీ ఫేక్‌గా అటవీశాఖ అధికారులు గుర్తించి ఆకతాయిలను హెచ్చరిస్తున్నా వారిలో మార్పు రావడం లేదు.

- మీతిమిరుతున్న ఆకతాయిల ఆగడాలు
- భయాందోళనలో జనం
- క్షేత్రస్థాయిలో పరిశీలించి ఫేక్‌గా నిర్ధారిస్తున్న అటవీశాఖ అధికారులు
- ఘటనలపై అటవీశాఖ సీరియస్

**చిత్తూరు కార్పొరేషన్:** అదిగో ఇక్కడ పులి వచ్చింది.. అంటూ వాట్సాప్, ఇన్‌స్టాగామ్, ఫేసుబుక్ వంటి సామాజిక మాధ్యమాలలో కొందరు ఫొటోలు పెడుతున్నారు. దీంతో సంబంధిత ప్రాంత వాసులు భయాందోళనకు లోనవుతున్నారు. దీన్ని అటవీశాఖ తీవ్రంగా పరిగణిస్తోంది. ఆ ఫొటోలు, వీడియోలు వైరల్ కావడంతో నిజాలు తెలుసుకునేందుకు అటవీశాఖ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి అటువంటిదేమీ లేదని స్పష్టత ఇస్తున్నప్పటికీ ఆగడాలు ఆగడం లేదు. గడిచిన 9 నెలల్లో ఇలాంటి ఘటనలు అనేకం జరిగాయి. అందరిని భయాందోళనకు గురిచేయాలనే శాడిజం మనస్వత్తంతో ఉన్నవారు ఇలా ప్రవర్తిస్తున్నారని నిపుణులు అంటున్నారు.

**జిల్లాలో ఇలా..**

- చిత్తూరు రూరల్ మండలం బీఎస్ఆర్‌పేట సమీపంలో రోడ్డు పనుల వద్ద బెంగాల్ టైగర్ కనిపించిందని వీడియోను వైరల్ చేశారు. తీరా క్షేత్రస్థాయిలో సిబ్బంది పరిశీలిస్తే అది అస్సాంలో జరిగిన వీడియోగా, సామాజిక మాధ్యమాల నుంచి డౌన్‌లోడ్ చేసినట్లు అధికారులు తేల్చారు.
- గుడిపాల మండలం పసుమంద పంచాయతీలో బెంగాల్ టైగర్‌ను చూశామని ఫోటోలు పెట్టారు. దీంతో మండల వాసులు భయాందోళనకు లోనయ్యారు. అక్కడికెళ్లి అటవీశాఖ సిబ్బంది తనిఖీలు చేస్తే ఇక్కడి వీడియో కాదని తేలింది. ఈ వీడియోను ఉత్తరప్రదేశ్‌లో తీసినట్లుగా గుర్తించారు.
- గుడిపాలలోని గొల్లమడుగు అటవీ ప్రాంతంలో పులి కూనలను వదిలి వెళ్లిందని వీడియో పెట్టారు. తల్లి కోసం పిల్లలు ఎదురుచూస్తున్నట్లు ఆ వీడియో సారాంశం. డీఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి నేరుగా క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. ఎఫ్ఆర్వో థామస్ సిబ్బందితో కలిసి కొండలు, గుట్టలను రెండు రోజులు పాటు జల్లెడ పెట్టి కూనలు లేవని నిగ్గుతేల్చారు. మధ్యప్రదేశ్‌లో జరిగిన సంఘటన వీడియో పెట్టారని అధికారులు తెలుసుకున్నారు. చిత్తూరు ఈస్ట్ రేంజ్‌లో వైరల్ చేసిన ఫోటోలు, వీడియోలు ఎక్కువగా బయట రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికులు పెట్టినట్లుగా గుర్తించారు. వాటిని స్థానికులు వైరల్ చేసినట్లు తెలుస్తోంది.
- పాకాల మండలం నేంద్రగుంట వద్ద పులి రోడ్డుపై వచ్చినట్లు ప్రయాణికులు భయాందోళనకు గురైనట్లు వీడియో పెట్టారు. ఆ వీడియో ఉత్తరప్రదేశ్ వీడియో అని అధికారులు తేల్చారు.
- వడమాలపేట మండలం బంగారెడ్డి కండ్రిగ సమీపం ప్రాంతంలో పులి వచ్చిందని వాట్సాప్ గ్రూప్‌లో పోస్టులు పెట్టడంతో ప్రాంతవాసులు బిత్తరపోయారు. తీరా అధికారులు రంగంలో దిగి విచారించడంతో గత సంవత్సరం నవంబరులో వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ సురేష్ బెంగళూరులో తీసిన ఫోటోగా తేల్చారు. ఇన్‌స్టాలో పెట్టిన వీడియోలో నుంచి తీసిన ఫోటోగా నిర్ధారించారు. ఇలాంటి విషయాల్లో వాస్తవాలు తెలుసుకోకుండా పలువురు వాట్సాప్ స్టేటస్‌లు పెడుతున్నారు. చదువుకున్న వారు సైతం ఇలా చేయడం సరికాదని అధికారులు సూచిస్తున్నారు.





మా ఊరిలో పులి వచ్చిందని వాట్సాప్ స్టేటస్‌లో పెట్టుకున్న ఫొటో, గుడిపాలలో ఉన్నట్లు పెట్టిన పులికూనల ఫొటో

**చర్యలు తప్పవు**



ఇప్పటి వరకు అవాస్తవ వీడియోలపై ఆకతాయిలను హెచ్చరించి వదిలేశాం. వీటిని అటవీశాఖ తీవ్రంగా పరిగణిస్తోంది. ఇకపై ఎలాంటి అవాస్తవ వీడియోలు వచ్చినా అటవీచట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. యువత సమాజశ్రేయస్సు కోసం బాటలు వేయాలి.

– థామస్, ఎఫ్ఆర్వో, చిత్తూరు ఈస్ట్

## ప్రశాంత కౌంటింగ్‌కు సహకరించాలి

- అల్లర్లను సృష్టిస్తే కఠిన చర్యలు
- ఎస్పీ మణికంఠ హెచ్చరిక
- చిత్తూరులో పోలీసుల కవాతు

**చిత్తూరు అర్బన్:** సార్వత్రిక ఎన్నికల ప్రశాంత కౌంటింగ్‌కు పోలీసులతో పాటు ప్రజలు, రాజకీయ పార్టీ నాయకులు సహకరించాలని ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. చిత్తూరు నగరంలో ఆదివారం పోలీసులు కవాతు నిర్వహించారు. 150 మంది పోలీసు సిబ్బంది, ఎస్టీఎఫ్, కేంద్ర బలగాలు, వజ్రా వాహనంతో ఫ్లాగ్ మార్చ్ చేపట్టారు. గాంధీ కూడలి నుంచి కోర్టు కాంప్లెక్స్, తోటపాళ్యం, పొన్నియమ్మన్, ఎంఎస్ఆర్‌కూడలి, దర్గా కూడలి, లాలూ గార్డెన్, టాప్‌లైన్, ఎంఎస్ఆర్ కూడలి, చర్చివీధి మీదుగా కవాతును నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. అల్లర్లు, హింసాత్మక ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. అసాంఘిక కార్యకలపాలు, సంఘవిద్రోహ చర్యలకు పాల్పడకూడదని తెలిపారు. ఏవైనా అవాంఛనీయ సంఘటనలు, అల్లరి మూకలు విధ్వంసానికి పాల్పడితే పోలీసుల స్పందన ఎలా ఉంటుందో మాక్‌డ్రిల్ నిర్వస్తున్నామన్నారు.

## సత్యంతోనే అవినీతికి చరమగీతం

**చిత్తూరు రూరల్ (కాణిపాకం) :** ప్రతిమనిషి సత్యాన్ని గ్రహిస్తే అవినీతికి చరమగీతం తప్పదని ప్రముఖ పారిశ్రామికవేత్త బి.రత్నారెడ్డి ఉద్ఘాటించారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ప్రముఖ సాహితీవేత్త మర్రిపూడి దేవేంద్రరావు రచించిన 'సత్యాగ్రాహి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాస్తవ సంఘటనలతో భావోద్వేగానికిగురైన మనసు లోతుల్లోంచి పెల్లుబికిన సత్యశోధనగా సత్యాగ్రాహి పుస్తకం కీర్తిని అందుకుంటుందన్నారు. భారతీయ తెలుగు రచయితల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు సి.నారాయణస్వామి మాట్లాడుతూ గాంధీజీ సత్యాన్ని శోధించి దేశ ప్రజలకు ఎన్నో సందేశాలు ఇచ్చారని, మానవీయతను తట్టిలేపే అక్షరాయుధంగా దేవేంద్రకవి సాహిత్యం మిగిలిపోతుందన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎంపీ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ సత్యాగ్రాహి కవితా సంపుటిలోని కవితలన్నీ సామాజిక స్పృహతో సాగుతూ సమాజాన్ని మేలుకొలుపుతాయన్నారు. ఈ సందర్భంగా ఇరవైమంది సాహితీవేత్తలను, సంఘసేవకులను దేవేంద్రరావు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు నందిపాటి చక్రపాణి, కొఠారి వెంకటరత్నం, సి.సుబ్రమణ్యం, బి.కోటీశ్వరమొదలియార్, కె.ఆనందనాయుడు, కేసీ లావణ్య, ఎంజే భాస్కర్ రెడ్డి, తోట గోవిందన్, జి.శాంతకుమారి, సోము ఉమాపతి ఎం.పురుషోత్తం ఆచారి, గొడు గుచింత గోవిందయ్య, పాలకూరు కన్నయ్య, పాడి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## అందుబాటులో విత్తనాలు, ఎరువులు

**చిత్తూరు కలెక్టరేట్ :** ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా విత్తనాలు, ఎరువులు విక్రయించాలని, అనుమతి లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా షాపుల ముందు నిల్వ, ధరలను సూచించే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయ అధికారుల నుంచి స్టాకు రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు ధ్రువీకరించుకోవాలని తెలిపారు. విత్తనాకు సంబంధించి సర్టిఫికెట్ ఆఫ్ సోర్స్, ఇతర వివరాలు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. ఎంఆర్‌పీకి మించి విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ఫారం-డీని ప్రతి నెల వ్యవసాయ కార్యాలయాల్లో సమర్పించాలని జేసీ సూచించారు.

## చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

**చిల్లకూరు :** పాత ఇనుప సామాను చోరీ చేసిన కేసులో ఇద్దరు నిందితులను ఆదివారం అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. మండలంలోని అంకుపాటూరు గ్రామంలో మూత బడిన ఎస్‌బీక్యూ స్టీల్ పరిశ్రమలో పాత సామాను నెల్లూరు హౌసింగ్ బోర్డుకు చెందిన తిరుమల వడివేలు, అరవ శేఖర్ అపహరించి ఆటోలో తరలిస్తుండగా కంపెనీ భద్రతా సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్ఐ సిరాజ్ వెంటనే స్పందించి నిందితులను వెంటాడి ఆటోలోని సామానుతో పాటుగా వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను కోర్టు హాజరుపరిచి కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.







యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తూ నూతన సంస్కరణలకు నాంది పలికింది. ఉపాధి కల్పనే ధ్యేయంగా సాంకేతిక వ్యవస్థను ఉపయోగించి జిల్లాలో ఉన్న ఉపాధి కార్యాలయాల స్వరూపాన్ని మార్చివేసింది. గతంలో అభ్యర్థులు ఎంప్లాయిమెంట్ కార్యాలయాలకు రోజుల తరబడి తిరిగి క్యూలో నిలబడి విద్యార్హతల వివరాలను నమోదు చేసుకునేవారు. ఉద్యోగాల సమాచారం అభ్యర్థికి తెలిసేది కాదు. నేడు ఒక్క క్లిక్‌తో సులభంగా రిజిస్ట్రేషన్ చేసుకునేలా వెసులుబాటు వచ్చింది. ఇందుకోసం ప్రత్యేక పోర్టల్‌ను రూపొందించారు. దీనిని నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్‌తో అనుసంధానం చేశారు.

– తిరుపతి సిటీ

# ఉద్యోగాల కల్పనకు ముందడుగు





**యు**వతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. నిరుద్యోగ యువత ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్ ద్వారా ఇంటివద్ద నుంచే చేసుకునేందుకు వెసులుబాటు కల్పించింది. httpr://empoyment.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వెంటనే లాగిన్ వివరాలు, రిజిస్ట్రేషన్ నంబర్ సదరు ఫోన్ నంబర్‌కు ఎస్ఎంఎస్, ఈ మెయిల్ ద్వారా పొందవచ్చు. ఎంప్లాయిమెంట్ కార్డును సైతం లాగిన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకుని ప్రింట్ తీసుకోవచ్చు. దీంతో పాటు ఎంప్లాయిమెంట్ కార్డ్ రెన్యూవల్, అదనపు విద్యార్హతల నమోదు వంటి సేవలు సైతం ఆన్‌లైన్ ద్వారా పొందేందుకు అవకాశం ఉంటుంది.

**“ అవకాశాలను ఉపయోగించుకోవాలి**

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో యువత కోసం పెద్ద ఎత్తున జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నాం. పదోతరగతి నుంచి ఉన్నత విద్య అభ్యసించిన వారు ఆన్‌లైన్ ఎంప్లాయిమెంట్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. దీంతో ఎప్పటికప్పుడు యువతకు కేంద్ర, రాష్ట్ర, ప్రైవేటు ఉద్యోగాల ఖాళీల సమాచారం పొందవచ్చు. రిజిస్ట్రేషన్ సమయంలో సమర్పించిన ఫోన్ నంబర్ యూజర్ ఐడీగా పరిగణిస్తారు. యువత ప్రభుత్వం కల్పించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.

– గోపికృష్ణ శ్రీనివాస్, ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయ అధికారి, తిరుపతి

- ఉపాధి కల్పనే ధ్యేయంగా ప్రత్యేక పోర్టల్
- ఒక క్లిక్ దూరంలో ఉద్యోగ అవకాశం
- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌తో సులువుగా ఉద్యోగ సమాచారం
- నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్‌తో అనుసంధానం
- మోడల్ కెరీర్ సెంటర్లుగా ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజీలు

**అతిసులువుగా ఉద్యోగ సమాచారం**

రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖలు జారీ చేసిన నోటిఫికేషన్ల సమగ్ర సమాచారం, ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాల ఖాళీల వివరాలు ఎంప్లాయిమెంట్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు నేరుగా ఎప్పటికప్పుడు అతి సులువుగా ఉద్యోగావకాశాల సమాచారం అందుతుంది. విద్యార్హతల ప్రకారం ఉద్యోగాల ఖాళీలు వివరాలు యువత ఫోన్ నంబర్లకు, ఈమెయిల్‌కు అలెర్ట్ మెసేజ్ వస్తుంది. వీటితో పాటు ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాల సమాచారం అందిస్తూ అటు యువతకు, ఇటు సంస్థలకు వారధిగా ఉపాధి కల్పన కార్యాలయ సిబ్బంది నిలుస్తున్నారు.



**జిల్లాలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ షురూ**

తిరుపతి జిల్లాలో ఎంప్లాయిమెంట్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. తద్వారా యువత పెద్ద ఎత్తున తమ విద్యార్హతలను నమోదు చేసుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని, ప్రైవేటు సంస్థలలోని ఉద్యోగావకాశాల వివరాలను పోర్టల్ ద్వారా పొందుతూ, ఎప్పటికప్పుడు తమ వివరాలను అప్‌డేట్ చేసుకుంటున్నారు. ఒకప్పుడు ప్రభుత్వ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవాలంటే ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ కార్డు నంబర్ తప్పనిసరి అనే నిబంధన ఉండేది. ప్రస్తుతం అటువంటి నిబంధనలకు చరమగీతం పాడుతూ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం నూతన సంస్కరణలు తీసుకువచ్చింది.

